క్లుప్తంగా

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్:మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, సి.బెళగల్,బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఇస్కాన్ సంస్థ ప్రధాన సేవకుడు రాక

కోడుమూరు రూరల్: ఇస్కాన్ సంస్థ ప్రధాన సేవకులు శ్రీరూపేశ్వర చైతన్య దాస్ ఆదివారం కోడుమూరుకు రానున్నట్లు భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. కోడుమూరులో పునర్నిర్మిస్తున్న హరి హర క్షేత్ర శ్రీలక్ష్మివేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూపేశ్వర చైతన్య దాస్ సందర్శిస్తారని చెప్పారు.

పీహెచ్‌సీలలో నిలిచిపోయిన వైద్య సేవలు

సి.బెళగల్: జీఓ నంబర్ 85 వ్యతిరేకిస్తూ మండలంలోని సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌లలోని వైద్యులు చేపట్టిన ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. దశలవారీ నిరసన కార్యాక్రమంలో భాగంగా శనివారం పీహెచ్‌సీలలో సాధారణ వైద్య సేవలు నిలిపివేశారు. సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్లు మాధురెడ్డి, సునీత, పోలకల్ డాక్టర్లు హరిచంద్రుడు, శ్రావణి నల్ల బ్యాడ్జిలు ధరించి అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందించారు. పీహెచ్‌సీలలో అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ విధులను బహిష్కరించడంతో ముడుమాల, గొల్లలదొడ్డి గ్రామాల్లో 104 ఫ్యామిలీ డాక్టర్ సేవలను సైతం వైద్యులు నిలివేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతామని డాక్టర్లు హెచ్చరించారు.

చెరువుకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

గడివేముల: మండలంలోని మంచాలకట్ట గ్రామం చెరువుకు శనివారం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి నీటిని విడుదల చేశారు. ఎస్సార్‌బీసీ నుంచి ఎత్తిపోతల పథకాన్ని స్విచ్ ఆన్ చేసి చెరువులోకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ త్వరలోనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామన్నారు.గండిపడిన అలుగనూర్ రిజర్వాయర్ పనులకు రూ.34 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, వంగాల మురళీధర్ రెడ్డి, దేశం సత్యనారాయణ రెడ్డి, దేశం నారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి వనరుల క్లోరినేషన్



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయిస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మంచినీటి వనరుల్లో సర్పంచ్ పాండురంగన్న క్లోరినేషన్ చేయించారు. శనివారం ఆయన గ్రామంలోని మంచినీటి ట్యాంక్‌లతో పాటు, క్రిష్ణదొడ్డి రోడ్డులో ఉన్న బావిలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రధాన వీధులను శుభ్రం చేయించి, మురుగు కాలువల్లో పూడిక తీయించారు.

నివాళి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో శని వారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఏచూరి త్యాగాల ను ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నాగన్న, మధు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు,రంగస్వామి, నాగమ్మ, పద్మావతి, వెంకటస్వామి, నాగరాజు, సిద్దన్న, శేషాద్రి, ఈశ్వరమ్మ, శేఖర్, గఫూర్‌మియా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు న్యూసిటీ: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పదో తరగతి పాస్, ఇంటర్ పాస్, ఫెయిల్, 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న యువత దరఖాస్తు చేసుకోవలని సూచించారు.

వైద్య విద్యపై నిర్ణయాన్ని మార్చుకోవాలి



గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ఏర్పాటైతే కొంత వరకు సీటు సాధించడం సులువు అవుతుందని విద్యార్థులు ఆశపడ్డారు. అయితే ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుంది. మంజూరైన మెడికల్ కళాశాలల నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయం. ప్రభుత్వ నిర్ణయం మాలాంటి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లే. ప్రభుత్వం వైద్య విద్యపై తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలి. పేద విద్యార్థులకు అండగా నిలువాలి.

– ఎస్ ముబారక్, నీట్ విద్యార్థి, సి.బెళగల్



విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు



గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైద్య కళాశాలలను మంజూరు చేసింది. కళాశాలల నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. వైద్య విద్య చదువాలనుకునే విద్యార్థులు ఎంతో సంతోష పడ్డారు. అయితే టీడీపీ ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించడం అన్యాయం. వైద్య విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం వుంది. జిల్లాలో సుమారు వంద మంది విద్యార్థులకు అన్యాయం జరిగినట్లే. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

– రవీంద్రనాథ్, ఆర్‌వీఎఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓర్వకల్లు

‘ఏరు’దాటని కష్టాలు!

- అధ్వానంగా మారిన బ్రిడ్జీలు
- వర్షాకాలం పొంగిపొర్లుతున్న వాగులు
- అక్కడక్కడ రాకపోకలు బంద్

పాణ్యం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జీలు అధ్వానంగా మారాయి. గ్రామీణులు సమస్యలతో సతమతం అవుతూనే ఉన్నారు. ఏళ్లకిందట నిర్మించిన బ్రిడ్జీలు కుంగిపోయాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు వర్ణనాతీతం. వాగులు, వంకలు వద్ద నిర్మించిన బ్రిడ్జిలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. కొన్ని గ్రామాల్లో వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. పాణ్యం మండలంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షకాలంలో వరద నీరు బ్రిడ్జిలపై ప్రవహిస్తుంది. అధిక వర్షాల కారణంగా ఈ ఏడాది బ్రిడ్జీల సామర్థ్యం మరింత తెలిపోయాయి. జుర్రాగు బ్రిడ్జి, వొద్దెలవాగు బ్రిడ్జి, గుండకోమ్మవంక బ్రిడ్జి, కానుకల వాగు బ్రిడ్జి, మునుగుంద వాగు బ్రిడ్జి అధ్వానంగా మారాయి. ఈ బ్రిడ్జీలు ఇలానే ఉంటే భవిష్యత్తులో సమస్యలు మరింత జఠిలంగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జీలను పునర్నిర్మించాలని కోరుతున్నారు.



గగ్గటూరు మునుగుంద వాగు దుస్థితి (ఫైల్)

పాణ్యం జుర్రాగు బ్రిడ్జి....

నియోజకవర్గమైన పాణ్యం పట్టణంలోకి వెళ్లే రోడ్డులో జుర్రాగు బ్రిడ్జి ఉంది. ఈ బ్రిడ్జికి ఎలాంటి సైడ్‌వాల్ లేవు. నిత్యం వేల సంఖ్యలో ఈ ఇరుకు బ్రిడ్జిపైనే వెళ్లాల్సి ఉంది. వాగుకు వరద పెరిగి బ్రిడ్జిపై ప్రవహిస్తే డొంగు ద్వారా వాహనాలను మళ్లిస్తారు అధికారులు. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో బ్రిడ్జి వెడల్పు పెంచాలని, రాకపోకలకు అనుకూలంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి వేళ మరింత భయంతో వాహనాలు నడపాల్సి ఉంటుంది.

వొద్దెల వాగు బ్రిడ్జి

బనగానపల్లె రోడ్డులో పాణ్యం సమీపాన వొద్దెల వాగు బ్రిడ్జి ఉంది. నంద్యాల, బనగానపల్లె, తాడిపత్రికి వాహనాలన్నీ ఈ బ్రిడ్జిపైనే వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు కంటే బ్రిడ్జి తగ్గులో ఉండడంతో ప్రమాదాలకు అడ్డాగా మారింది. బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా మారింది. బ్రిడ్జిపై ఒక్క వాహనం మాత్రమే వెళ్లాల్సి ఉంటంది. ఈ వాగుకు వరద నీరు పెరిగిదంటే అటు– ఇటువైపు వాహనాలు నిలినిపోవాల్సిందే. గత ప్రభుత్వంలో దాదాపుగా రూ. కోటి మంజురైనా ఎన్నిక లకోడ్ కారణంగా పనులు చేపట్టలేదు.

ఇరుకైన గుండకోమ్మవంక బ్రిడ్జి

పాణ్యం నుంచి బనగానపల్లె వెళ్లే ప్రధాన దారిలో గోనవరం వద్ద ఉన్న గుండకోమ్మవంక వాగు బ్రిడ్జి ప్రమారకరంగానే ఉంది. బ్రిడ్జి పొడవున్నా.. రెండు భారీ వాహనాలు ఎదురైతే అంతే సంగతి. ఈ బ్రిడ్జి కూడా రోడ్డుకు పూర్తి తగ్గులో ఉంది. వాగు పొంగి పార్లితే రాకపోకలు నిలిచిపోతాయి. ఒక్కోసారి కిలోమీటర్లు దూరంలో వాహనాలు నిలచిపోయిన సంఘటనలు లేకపోలేదు.

శిథిలావస్థలో కానుకలవాగు బ్రిడ్జి

జాతీయ రహదారి నుంచి కొలురు వెళ్లే రోడ్డులో కానుగల వాగుపై బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి కుంగిపోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బైక్‌లు, ఆటోలు వెళ్లేందుకు చిన్నపాటి బ్రిడ్జిని నిర్మించుకుని వాగుపొంగిన సమయంలో రాకపోకలు సాగిస్తుంటారు కొలూరు ప్రజలు.

భక్తులకు ఇబ్బందిగా మునుగుంద వాగు

గగ్గటూరు గ్రామం శివారును మునుగుంద వాగుపై ఉన్న బ్రిడ్జి నాలుగు అడుగు మేరా రోడ్డు కంటే తగ్గులో ఉంది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శించుకునేందుకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని బ్రిడ్జి దాటుతుంటారు. వాగుకు ఎలాంటి రక్షణ గోడలు, ప్రమాద హెచ్చరికల బోర్డులు లేవు.

బ్రిడ్జీల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

మండలంలో ఆర్‌అండ్‌బీ బ్రిడ్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. ఈ ఏడాది వచ్చిన అధిక వర్షాల కారణంగా బ్రిడ్జీలను ఎక్కి వరదనీరు ప్రవహించింది. ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు వివరించాం. కొత్త బ్రిడ్జీల కొరకు రూ. 18కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు కూడా పంపాం.

– వెంకటేశ్వరరెడ్డి ఆర్‌అండ్‌బీ ఏఈ



పాణ్యం వద్ద ఉన్న వొద్దెల వాగుపై వరదనీటి ప్రవాహం(ఫైల్)



పాణ్యం వొద్దెల వాగు నీటి ప్రవాహం కారణంగా నిలిచిపోయిన వాహనాలు(ఫైల్)



గోనవరం వద్ద తగ్గులో ఉన్న బ్రిడ్జి

లోక్ అదాలత్‌లో 43 కేసులు పరిష్కారం

ఓర్వకల్లు: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఓర్వకల్లు మండలానికి సంబంధించి 43 కేసులు పరిష్కారమైనట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను సులభంగా పరిష్కారం అవుతాయన్నారు. బాధితులకు ఈ వేదిక ఓ వరం లాంటిదన్నారు. దాదాపు 85 కేసులు పెండింగ్‌లో వుండగా, లోక్‌అదాలత్‌లో ఇప్పటి వరకు 43 కేసులను పరిష్కారం అయ్యాయి. తాను బాధ్యతలు స్వీకరించాక 20 రోజుల్లోనే ఇన్ని కేసులకు పరిష్కారం లభించడం సంతోషంగా ఉంది.

కోడుమూరులో చోరీ



కోడుమూరులో దొంగతనం జరిగిన దుకాణం

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న మహబూబ్ బాషా ట్రేడర్స్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణం పైకప్పురేకు తొలగించి రూ.30వేలు విలువైన నూనె క్యాన్లు, బియ్యం బస్తాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కోడుమూరు పోలీసులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. అదేవిధంగా దొంగల వేలిముద్రలను సేకరించారు. ఈ మధ్యకాలంలో పట్టణ శివారులోని దుకాణాలు, చిల్లర దుకాణాలను టార్గేట్‌గా చేసుకుని దొంగలు దొంగతనాలకు పాల్పడుతుండడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకర మంచినీటి ట్యాంక్ కూల్చివేత

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో ప్రమాదకరంగా ఉన్న మంచినీటి ట్యాంక్‌ను ఎట్టకేలకు శనివారం అధికారులు కూల్చివేశారు. రజక(చాకలి) వీధిలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన 90 వేల లీటర్ల సామర్థ్యం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు శిథిలావస్థకుచేరి పెచ్చులూడుతున్న నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భారీ క్రేన్ సాయంతో ట్యాంక్‌ను తొలగించారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంక్ నుంచి ప్రస్తుతం కొండపేట, తోటగేరి, ముస్లింపేట, చాకలి వీధికి కుళాయిలద్వారా నీటిని సరఫరా అవుతుందని ఈఈ మొహిద్దీన్, ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఆయా కాలనీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా నేరుగా పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని వారు తెలిపారు. కొత్త ట్యాంక్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు.



భారీ క్రేన్‌తో ట్యాంక్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

కోల్స్ దొరకు ఘన నివాళి

కర్నూలు (టౌన్): నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం కోల్స్ దొరకు ఘన నివాళులర్పించారు. కోల్స్ దొర విగ్రహానికి ఈవాంజికల్ సపోర్టింగ్ టీమ్ (ఈఎస్‌టీ) సభ్యులు పూలమాలలు వేశారు. ఈఎస్‌టీ వ్యవస్థాపకు లు, డైరెక్టర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ కోల్స్ దొర 106 సంవత్సరాల క్రితం కర్నూలు నగరంలో విద్యాలయాలు, వైద్యశాలలు, చర్చిలు నిర్మించి ఎంతో మందికి ఉపాధి కల్పించార న్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సురేష్, జయాకర్, దేవిడ్ పాల్, జయాకర్, ప్రవీణ్, మోజస్, విజయ్‌కుమార్, సాగర్ పాల్గొన్నారు.



కోల్స్ దొరకు నివాళులర్పిస్తున్న ఈఎస్‌టీ సభ్యులు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కర్నూలు సిటీ: విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఎప్పుడూ కూడా లక్ష్యాన్ని విస్మరించకూడదన్నారు. గతంలో తాను చదువుకున్న కాలేజీకే ఇప్పుడు పార్లమెంటు సభ్యుడిగా ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

‘సుంకేసుల’కు కొనసాగుతున్న ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి బ్యారేజీ (సుంకేసుల బ్యారేజీ)కి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీలోకి 20,361 క్యుసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, కేసీ కాలువకు 2,445 క్యుసెక్కులు, నదిలోకి 17,916 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రేపు వినతుల స్వీకరణ రద్దు

కర్నూలు (టౌన్): ఈనెల 16వ తేదీన నగరపాలక కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని మి లాద్–ఉన్–నబీ పండుగ సెలవు కారణంగా రద్దు చేసినట్లు నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.వచ్చే సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం ఉండదని, నగర ప్రజలు గమనించాలన్నారు.

వరసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు



గణనాథుడిని దర్శించుకున్న భక్తులు

కల్లూరు: కల్లూరు వీకర్ సెక్షన్ కాలనీలో కొలువుదీరిన వరసిద్ధి వినాయకునికి శనివారం భక్తు లు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంజీవులు గౌడ్, మాధవి, రమేష్ గౌడ్, జయశ్రీ, శ్రీనివాసులు, సుజాత, తులసి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికార కేంద్రం పరిశీలన

కర్నూలు(హాస్పిటల్): అభాగ్యులైన మహిళలకు ఎన్‌టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) చేయూతనందిస్తోందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. శనివారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మహిళలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం అభాగ్యులైన మహిళలకు ఎంతో సేవలు అందిస్తోందని చెప్పారు. నగరం నడిబొడ్డులో మహిళలకు రక్షణగా ఉన్న ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కేంద్రం నిర్వహణకు నిధుల కొరత గురించి అధికారి అంజనీభూషణ్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు తగ్గిన వెంటనే తన సొంత ఖర్చులతో జేసీబీ పెట్టి ప్రాంగణమంతా శుభ్రం చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. దీంతో పాటు దీని అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను రాబట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కేంద్రంలో ప్రభుత్వ శిక్షణ జరిగేలా కలెక్టర్‌తో చర్చిస్తానని చెప్పారు. ఆయన వెంట టీడీపీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్వీ శివరాజు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్ : హృదయ మాలిన్యాన్ని తొలగించి, సదా భగవంతుడికి చేరువగా చేసే భగవద్గీత నిత్యశ్రయ గ్రంథమని ధర్మప్రచారకులు విశ్వనాథ గురూజీ అన్నారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో శనివారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఏకాదశిని పురస్కరించుకొని సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. పరివర్తన ఏకాదశి విశిష్టతను గురించి వివరించారు. ఏకాదశి మన బుద్ధిని పరమాత్మ వైపు మరల్చి, భగవంతునిలో ఐక్యమగుటకు ఉపయుక్తమగు కాలమన్నారు. భగవద్గీత పారాయణం చేయడం వలన జీవిత గమ్యం మారి, ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు.



గుంతలమయంగా లక్ష్మీపురం రోడ్డు



దొడ్డిపాడు గ్రామం రోడ్డు ఇలా....

రోడ్లు ఛిద్రం!

కల్లూరు: మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రంగా మారాయి. అడుగుకో గుంత అన్నట్లుగా ఉన్నాయి రహదారులు. గత నెలలో కురిసిన వర్షాలకు రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం మీదుగా దొడ్డిపాడు గ్రామానికి, ఉలిందకొండ నుంచి యాపర్లపాడుకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉలిందకొండ నుంచి యాపర్లపాడు కేవలం నాలుగు 4 కి.మీ ఉంటుంది. ఈ రోడ్డుపై ఈ నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు బైక్‌పై అరగంట పడుతుందంటే రోడ్డు ఎలా ఉంటుందో ఎవరికైనా అర్థం అవుతుంది. అలాగే లక్ష్మీపురం బస్‌స్టాఫ్ నుంచి దొడ్డిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేల గుంతలమయంగా మారింది. అధికారులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తస్మాత్ జాగ్రత్త... !

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం జాతీయ రహదారిలో జులపాయవాగుపై ఉన్న బ్రిడ్జిని ఇటీవలనే ఓ లారీ ఢీకొంది. దీంతో సైడ్‌వాల్ సగానికి పైగా కూలిపోయింది. అయినా హైవే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేకపోయారు. అసలే బ్రిడ్జి ఇరుకు. నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి.ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం జరిగినట్లే. ఇప్పటికైె హైవే అధికారులు చర్యలు తీసుకోని సైడ్‌వాల్‌ను నిర్మించి రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడాలని వాహనచోదకులు కోరుతున్నారు.



తమ్మరాజుపల్లె జాతీయ రహదారి సైడ్‌వాల్ పడిపోయిన దృశ్యం